క్లుప్తంగా

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



8వ రేషన్ దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్, సీఎస్ డీటీ కిశోర్

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలోని రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఏఓ విశ్వనాథ్, సివిల్ సప్లై డీటీ కిశోర్ గురువారం తనిఖీ చేశారు. గ్రామంలోని 8వ రేషన్‌దుకాణం డీలర్ రాజశేఖర్ నిర్వహిస్తున్న షాపులో నిల్వ ఉన్న 135 బ్యాగుల రేషన్‌ను తనిఖీ చేయగా నిల్వలు సరిపోయాయి. అలాగే 9వ రేషన్ దుకాణం డీలర్ పార్వతమ్మ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ఉండాల్సిన స్టాకు కంటే 10 క్వింటాళ్ల రేషన్ బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నివేదికను జిల్లా అధికారులకు నివేదికలు అందజేయనున్నట్లు తెలిపారు. వీఆర్వో అల్లావుద్దీన్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని శివ ట్రేడర్స్, కార్తీక్ ఆగ్రో ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో రూ.3, 81, 000 విలువ చేసే బయో ఉత్పత్తుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. రసాయన ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించినా, బిల్లులేకుండా విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణదారులకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్ ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులకు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం నోటీసులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ దుకాణాలకు ముందు భాగంలో రేకుల నిర్మాణం , మట్టిని ఎత్తుగా వేసుకోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వెంటనే తొలగించాలని, లేని యెడల అధికారులు కూల్చి వేస్తారని హెచ్చరిస్తూ నోటీలు అందజేశారు. ఈఓపీఆర్డీ స్వామినాయక్, పంచాయతీ కార్యదర్శి నాగేషులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బండిఆత్మకూరు: స్థానిక రాఘవేంద్ర స్కూల్‌లో ఎస్ఐ జగన్‌మోహన్ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారుల ముసుగులో మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరెస్పాండెంట్ బిజ్జం వెంకటసుబ్బారెడ్డి తో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు



బెల్లం ఊట పారబోస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లా హెచ్చరించారు. గురువారం మండలంలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను పోలీసులతో కలిసి పారబోశారు. అలాగే 30 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. దాడుల్లో సిబ్బంది శ్వేత, శివన్న, సుధీర్‌కుమార్, మధుప్రసాద్ పాల్గొన్నారు.

వరినారులో గడ్డి మందు పిచికారీ

మహానంది: తండ్రి తనకు జీవనాధారంగా ఇచ్చిన భూమిలో బంధువులు వాటా అడుగుతున్నారని, ఇవ్వనందుకు వరి పొలంలో గడ్డి మందు చల్లి నారు పనికిరాకుండా చేశారని నందిపల్లె గ్రామానికి మహిళ పాశం జయలక్ష్మమ్మ వాపోయారు. సోదరుడు, ఆయన కుమారులు పొలంలో వాటా ఉందంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ విషయంపై ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్యుమెంట్లు పరిశీలించి విచారణ చేస్తామన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ చేశారు. అలాగే ఘంటామఠం, యాంఫీథియేటర్, టూరిస్ట్ బస్టాండ్, పాత ఫిల్టర్ బెడ్ ప్రాంగణం పలుచోట్ల పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎం.రమణమ్మ, ఈఈ ఎం.నరసింహారెడ్డి, పర్యవేక్షకులు పాల్గొన్నారు.





పొలంలో మట్టిని తవ్వుతున్న దృశ్యాలు

పంట పొలాల మధ్య మట్టి తవ్వకం

నందిపల్లె గ్రామంలోని మదార్‌వలి స్వామి దర్గా నుంచి పొలాలకు వెళ్లే మార్గంలో పచ్చని పైర్ల మధ్య ఉన్న ఓ పొలం నుంచి కొందరు కాంట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారని చుట్టుపక్కల రైతులు ఆరోపిస్తున్నారు. సీలింగ్ భూములను సాగు నిమిత్తం రైతులకు కేటాయిస్తే వాటిని వ్యాపారపరంగా వాడుకుంటున్నారని సమాచారం. భూగర్భ గనుల శాఖ చట్టం మేరకు నిర్ణీత లోతు వరకే మట్టిని తవ్వాల్సి ఉండగా నామమాత్రపు అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా అధిక లోతు వరకు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. రైల్వే పనుల పేరుతో జేసీబీలతో మట్టిని తవ్వేస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తుండటంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు చుట్టుపక్కల ఉన్న వరి పొలాలు దుమ్ము కొట్టుకుపోతున్నాయంటూ సమీప పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా.. పట్టా భూముల్లోనే మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకున్నట్లు చెప్పారన్నారు. భూమిని కొని రైల్వే పనుల కోసం తరలిస్తున్నారన్నారు. ఆ భూములు పట్టా భూములా, లేక సీలింగ్ భూములా అనే విషయంపై పూర్తి స్థాయి విచారణ చేస్తామన్నారు. ప్రస్తుతానికి మట్టి తరలింపు ఆపాలని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ద్వారా హెచ్చరికలు చేశామని చెప్పారు. – మహానంది

రైతులకు దిక్సూచిలా పొలంబడి

వెలుగోడు: రైతులు పంటలసాగులో పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేలా సాధికారత కల్పించడమే ఇండి గ్యాప్ పొలంబడి లక్ష్యమని ఏఓ పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గురువారం వెలుగోడులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రబీ సీజన్‌లో «మన ఊరి నేస్తాలు» అనే రైతు సంఘంతో అనుసంధానించి మినుము పంటలో మేలైన వ్యవసాయ పద్ధతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు రసాయన రహిత వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విత్తనం నుంచి దిగుబడి విక్రయం వరకు సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, కలుపు నివారణ, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు తెలియజేశారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని పేర్కొన్నారు. అవసరమైన మేర మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడుతూ, సాగు ఖర్చు తగ్గించుకోవాలని, నాణ్యమైన పంట దిగుబడులు పొందాలన్నారు.



మినుము పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ పవన్‌కుమార్

రైతులు ఎఫ్పీఓలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం, సేంద్రియ ఉత్పత్తుల సర్టిఫికేషన్ పొందడం వంటి అంశాలను వివరించారు. స్కోప్ సర్టిఫికెట్ అనంతరం డిజి రెడీ సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. దీని ద్వారా రైతులు పండించిన ఉత్పత్తులను 135 దేశాల్లో విక్రయించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది సుధారాణి, అజిత్‌కుమార్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

జూపాడుబంగ్లా: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక మోడల్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డుభద్రత పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు 18ఏళ్ల వయస్సు నిండి మేజర్లు అయ్యే వరకు ద్విచక్ర వాహనాలను నడపరాదన్నారు. తప్పనిసరైన పరిస్థితుల్లో వాహనాలను నడపాల్సి వస్తే రోడ్డు భద్రత–ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. యుక్త వయస్సులో బైక్ నేర్చుకున్నామనే ఆనందంతో ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బైక్ తీసుకొని రోడ్లపైకి వచ్చి అతివేగంతో నడపటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, పీఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి నడవడిక, క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ ఓబులేసు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.యేసురత్నం

ఆత్మకూరు: నేషనల్ హైవే కింద అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల నాయకులు చందావారి వెంకటేశ్వర్లు, ఎస్.స్వాములు డిమాండ్ చేశారు. వారు గురువారం మాట్లాడుతూ.. పట్టణం నుంచి ముష్టపల్లె డైరీ కాంప్లెక్స్ సిద్ధపల్లె, పెద్దఅనంతాపురం గ్రామాల ప్రజలు దాదాపు 10 నుంచి 12 వేల మంది నివశిస్తున్నారన్నారు. వీరు ఆయా గ్రామాలకు వెళ్లడానికి నేషనల్ హైవే కింద అండర్ పాస్ మార్గం ఏర్పాటు చేయాలన్నారు. నేషనల్ హైవే నుంచి ఉర్దూ స్కూల్ మీదుగా నంద్యాల టర్నింగ్ నుంచి ఆత్మకూరులోకి చేరుకునేందుకు చుట్టూ తిరిగి రావడం వల్ల 2 కి.మీ దూరం పెరుగుతుందన్నారు. మళ్లీ తిరిగి గ్రామానికి రావడానికి వెంకటాపురం రోడ్డు మీదుగా గీతాభవన్ హోటల్ దాటి మదరసా వద్ద యూటర్న్ తీసుకుని రహదారికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు నేషనల్ హైవే కింద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వాడాలలో రెండిళ్లలో చోరీ

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చంద్రకళ అనే మహిళ తన భర్తకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాదుకు వెళ్లిందన్నారు. ఆమె వచ్చి చూడగా..ఇంటి తలుపుల తాళం పగలగొట్టి, ఇంట్లో బీరువాలోని బట్టలు వస్తువులు చెల్లా చెదురుగా పడిఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. బీరువాలోని 36 తులాల వెండి కడియాలు, 2 జతల కమ్మలు అపహరణకు గురయ్యాయని, అలాగే నాగలక్ష్మమ్మ అనే మహిళ ఇంట్లో కూడా 2 తులాల బంగారం, రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్లు సేకరించినట్లు వివరించారు.



బీరువా వద్ద చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలి

ఆత్మకూరు: ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డీఎస్పీ రామంజినాయక్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో.. ట్రాఫిక్ రూల్స్, రోడ్డు సేఫ్టీ, హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. టూవీలర్‌పై ప్రయాణించే సమయంలో రోడ్డు ప్రమాదం జరిగితే హెల్మెట్ కాపాడుతుందన్నారు. అలాగే కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదంలో వాహనదారులు మృతి చెందుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ రహదారి సూత్రాలను పాటించాలన్నారు. సీఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

26లోపు నమోదు చేసుకోండి

మిడుతూరు: ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, పాలీటెక్నిక్‌లో ఉత్తీర్ణులై 21–24 సంవత్సరాల లోపు యువతీ, యువకులకు నెలకు రూ. 5 వేల స్టైఫండ్‌తో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ లోపు ఆసక్తి గల యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తం

సీసీ రోడ్ల ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామంలో రూ.3.20 కోట్లతో నిర్మించిన అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్లను గురువారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని వెస్ట్రన్ కాలనీ, ఈస్ట్రన్ కాలనీ, ఖబరస్తాన్, బీహెచ్ఈఎల్ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో నిర్మించిన రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మంచినీటి సమస్యను తీర్చడంతోపాటు మౌలిక వసతులు మెరుగు పరుస్తామన్నారు. అనంతరం ఏపీ జెన్‌కో అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సున్నిపెంట గ్రామంలో ప్రభుత్వ ఆస్తులను కొందరు ఆక్రమిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డప్పు కళాకారులకు ఉపాధి కల్పించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: డప్పు కళాకారులకు ఉపాధి కల్పించాలని కోరుతూ నవ్యాంధ్ర మాదిగ చర్మకారుల, డప్పు కళాకారుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట్ల గోవిందప్రసాద్ మాదిగ గురువారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏపీ జెన్‌కో అతిథి గృహంలో స్థానిక ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు నాగెళ్ల సురేష్‌తో కలిసి ఎమ్మెల్యే బుడ్డాను కోరారు. మహాశివరాత్రి, ఉగాది వంటి పర్వదినాలలో, స్వామి అమ్మవార్ల ఊరేగింపు సేవలలో డప్పు కళాకారులకు అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే దేవదాయశాఖ అధికారులతో చర్చించి డప్పు కళాకారులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేసీ కెనాల్ పర్యవేక్షణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి ఉన్నారు.

గృహ సిలిండర్లను కమర్షియల్‌కు వాడితే చర్యలు

నందికొట్కూరు: గృహాలకు వాడే గ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌కు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, అగ్రికల్చర్ అధికారి విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని హోటల్స్‌పై విజిలెన్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహాలకు వాడాల్సిన సిలిండర్లు కమర్షియల్‌కు వాడుతున్న హోటళ్ల యజమానులపై నిత్యవసరాల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు. ఆరు హోటళ్లపై దాడులు చేసి 12 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణపురం, ఈర్నపాడు గ్రామాల్లో గురువారం మండల పశు వైద్యాధికారులు అనూష, గౌసియా ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు చూడి పరీక్షలు, గొడ్డు మోతు పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే పశువులకు బాహ్య పరాన్నజీవులు సోకకుండా మందులు స్ప్రే చేశారు. గొర్రెలకు బొబ్బ రోగం రాకుండా, కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేశారు. జె.వి.వో. సునీల్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్లు శివశంకర్ రెడ్డి, సతీష్, అర్జున్, జయశ్రీ అటెండర్ రమేష్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పగిద్యాల: మండలంలోని 0 –6 సంవత్సరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ కోరారు. గురువారం స్థానిక సచివాలయం-1లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు కాని పిల్లలు అందరిని తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పగిద్యాలలో రెండు రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రా రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

నేడు ఆధార్ శిబిరం

బండి ఆత్మకూరు: మండల పరిధిలో ఏ.కోడూరు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు ఐ.సి.డి.ఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరేళ్ల వయసులోపు పిల్లలకు ఆధార్ నమోదు చేస్తారని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: జగనన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పట్టణ సమీపంలోని కొణిదేల రోడ్డు పక్కనున్న జగనన్న కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో విద్యుత్ లేదని, మంచినీటి వసతి, రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉస్మాన్‌బాషా, గోకారి, షబీర్, శాలిబాషా, ఖాజా మహమ్మద్‌బాషా పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

పగిద్యాల: పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయ నాయక్ అన్నారు. గురువారం నెహ్రూనగర్ గ్రామంలో పశువైద్యాధికారిణి రాగ సంధ్య ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహువార్షిక పశుగ్రాసాల సాగు, గోకులం షెడ్లు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు, కృత్రిమ గర్భధారణ పరీక్షలు, గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందు తాపించారు.

పాములపాడు: పాడి పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందని పశువైద్యాధికారి భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని వేంపెంట గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 ఎద్దులు, 20 గేదెలు, 25 దూడలకు, గొర్రెలు, మేకలు నట్టల నివారణ మందులు తాపించారు.



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిజేరియన్

నందికొట్కూరు: స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో సిజేరియన్ ఆపరేషన్ విజయవంతం గా చేసినట్లు వైద్యులు రాంబాబు తెలిపారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రహేలా నేతృత్వంలో ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత, పీడియాట్రిషన్ డాక్టర్ విలాయత్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సిజేరియన్ ఆపరేషన్ ద్వారా గర్భిణికి కాన్పు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన రసూల్ భార్య ఫర్వీన్ మొదటి కాన్పులో భాగంగా.. సాధారణ కాన్పు కాలేకపోవడంతో ఆరోగ్య కేంద్రంలోనే సిజేరియన్ చేశామని, తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. గతంలో ఇలాంటి కేసులను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేసేవారమన్నారు. ప్రస్తుతం ఇక్కడే ఆ వైద్యం అందుతోందని, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



తల్లి, బిడ్డను చూపుతున్న వైద్యులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



పటేల్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నందికొట్కూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహానంది డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నప్పటికీ నిధులు విడుదలలో జాప్యం తగదన్నారు. వినోద్, దినేష్, ఉస్మాన్ బన్నీ, మహిమరాజు, కురియన్ పాల్గొన్నారు.

పొలాలకు రహదారి ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: పట్టణ, వీపనగండ్ల పొలిమేరలో ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ సమీపంలోని నేషనల్ హైవే నిర్మాణం వద్ద రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు లింక్ రోడ్డు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి రోడ్డు వేయాలని కోరారు. రెండేళ్ల నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదన్నారు. ఎకర భూమి రూ.2 కోట్ల వరకు పలుకుతుందని, హైవే రోడ్డు నిర్మాణం కోసం ఎకరా రూ.14.6 లక్షలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గోపాలు, రైతులు పాల్గొన్నారు.



హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి



ఉల్లాస్ శిక్షణలో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్


పగిద్యాల: స్వయం సహాయక సంఘాల్లోని వయోజనులందరికీ అక్షరాలు నేర్పించాలని కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ గౌతమ్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వలంటీర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనలకు అక్షరాలు నేర్పించడం ప్రశంసనీయమన్నారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓ సుభాన్, ఏపీఎం చంద్రకళ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, కెనరా బ్యాంకు మేనేజర్ కావేరి, ఉల్లాస్ సూపర్ వైజర్ రమణ, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి ఉన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామ పంచాయతీలు, ఆరు మజరా గ్రామాల్లోని నిరక్షరాస్యులైన వయోజనులను వలంటీర్లు అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఉమ్మడి జిల్లా వయోజన విద్యాకేంద్రం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యాకేంద్రాల వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 780 మంది వయోజనులైన నిరక్షరాస్యులున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. వారికి సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు అక్షరజ్ఞానం బోధించేందుకు గాను మండలం వ్యాప్తంగా 40 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా విధులు నిర్వర్తించేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, మెటీరియల్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఏపీఎం అంబమ్మ, సీసీలు, అకౌంటెంటు రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన


కొత్తపల్లి: రోడ్డు నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ ఎం.కేశవ అన్నారు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రోడ్డు నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్నారులు బైక్‌లు నడపడం నేరమన్నారు. యువత వాహనాలను నడిపే క్రమంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాములపాడు: మైనర్లు వాహనాలు నడపరాదని ఎస్ఐ సురేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్‌క్రైం గురించి తెలుసుకోవాలని ఇండ్లలో పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, పిల్లలు మంచిగా చదువుకొని భవిష్యత్తులో స్థిరపడాలని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

వాగులు, వంకలను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు




కాల్వను పూడ్చిన రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా: వాగులు, వంకలను ఆక్రమించుకొని పొలాలుగా మార్చుకుంటే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ హెచ్చరించారు. తంగడంచ రెవెన్యూ పరిధిలోని కొండయ్యవాగును జూపాడుబంగ్లాకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి పూడ్చివేయటంతో కిష్టయ్య, ఖాజా, శంకర్, రమణ తదితర రైతులు విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గురువారం కొండయ్యవాగును పూడ్చిన ప్రాంతాన్ని సందర్శించారు. అందుకు బాధ్యుడైన శ్రీనివాసులును పిలిపించి వాగును ఎలా పూడ్చివేస్తారని మందలించారు. పూడ్చిన కాల్వను వెంటనే యథావిధిగా చేయాలని సూచించారు. డీటీ సత్యదీప్, ఏఎస్ఓ హనుమంతు, వీఆర్వో రహీం, సర్వేయర్ కుమార్, రైతులు ఉన్నారు.

శాస్త్రీయంగా దూడల పెంపకం

పాములపాడు: లేగ దూడల పెంపకంలో శాస్త్రీయ పద్ధద్ధతులు అనుసరించాలని డీఎల్‌డీఏ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని లింగాల గ్రామంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలన ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచు మల్లీశ్వరరెడ్డి, నంద్యాల ఉప సంచాలకులు శ్రీనివాసరావు, డీఎల్‌డీఏ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మల్లన్న, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎల్‌డీఏ రాజశేఖర్